ప్రజాసేవకులు వలంటీర్లు

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని
- ఏలూరులో వలంటీర్లకు వందనం


ఏలూరులో వలంటీర్లకు సత్కారం చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఏలూరు ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్, నగర మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉంటూ సేవాతత్పరతతో నిత్యం ప్రభుత్వ సేవలను ప్రజల గడప వద్దకే తీసుకువెళ్తున్న వలంటీర్ల సేవలు మరువలేనివని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటరులోని డీసీఎంఎస్ గ్రౌండ్‌లో గురువారం ఏలూరు నియోజకవర్గ వలంటీర్లకు వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నగరంలోని వలంటీర్ల సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం అందించిన నగదు పురస్కారంతో పాటు ప్రత్యేకంగా ప్రతి ఒక్కరినీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ ప్రత్యేత అతిథులుగా హాజరయ్యారు. ఏలూరు నియోజకవర్గంలో 1495 మంది వలంటీర్లు ప్రజలకు సేవలు అందిస్తుండగా వారిలో ఐదుగురికి సేవా వజ్ర, 13 మందికి సేవా రత్న, 1477 మందికి సేవా మిత్ర అవార్డులను, నగదు పురస్కారాన్ని అందచేశారు. సేవా మిత్రకు రూ.15 వేలు, సేవా రత్నకు రూ.30 వేలు, సేవా వజ్రకు రూ.45 వేలు చొప్పున మొత్తం రూ.2 కోట్ల 19 లక్షల 90 వేలు నగదును అందచేశారు.

చంద్రబాబువి దిగజారుడు రాజకీయాలు

ఈ సందర్భంగా ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో చంద్రబాబు దిగజారుడు రాజకీయానికి కేరాఫ్ అడ్రెస్‌గా మారారని విమర్శించారు. ప్రజలకు మేలు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తొలినాళ్లల్లోనే వలంటీర్, సచివాలయ వ్యవస్థను అమలులోకి తీసుకువచ్చి ప్రభుత్వ పాలనను ప్రజల గడప వద్దకు తెచ్చారని, ఈ సేవలను చూసి ఓర్వలేని చంద్రబాబు నిత్యం ప్రభుత్వంపై బురద చల్లేందుకు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆళ్ల నాని ధ్వజమెత్తారు. చంద్రబాబుకు తోడు పవన్‌కళ్యాణ్ వలంటీర్లపై నీచమైన వ్యాఖ్యలు చేస్తూ అసత్య ఆరోపణలతో వలంటీర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించారని, వారి కుటిల రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టే సమయం ఆసన్నమైందని చెప్పారు. ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్లు కావాలంటే రోజులు తరబడి క్యూ లైన్లల్లో నిలబడి వేచిచూడాల్సిన దుస్థితి ఉండేదని, కాని నేడు తెల్లవారుజామునే వారి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందజేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ, విప్ పైడి భీమేశ్వరరావు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, వలంటీర్లు ఉన్నారు.


హాజరైన వలంటీర్లు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

క్లుప్తంగా

విశ్వకర్మ పథకంపై అవగాహన


పీఎం విశ్వకర్మ పథకంపై మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విజయరాజు

ఏలూరు రూరల్ : చేతి వృత్తుల ఆధారంగా జీవించే పేద కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ఆర్థిక సహాయం అందిస్తుందని డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు అన్నారు. గురువారం ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో విశ్వకర్మ పథకం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం దరఖాస్తు, బ్యాంకుల ద్వారా రుణాల మంజూరు, అర్హులు అందించాల్సిన పత్రాలు, చేతి వృత్తుల జాబితా తదితర అంశాలపై హస్తకళాకారుల అసోసియేషన్ సభ్యులకు అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీఓ టి శ్రీనివాస్ విశ్వనాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎన్ పుష్పలత, ఎల్‌డీఎం డి నీలాద్రి, విశ్వకర్మ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరక్టర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యంతో కుష్టువ్యాధి అదుపు



కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్ : కుష్టు, హెచ్‌ఐవీ, బోధ వ్యాధులపై అవగాహన పెంచుకుని వైద్యంతో అదుపు చేయవచ్చని లెప్రా సొసైటీ సంస్థ రాష్ట్ర సమన్వయకర్త రాధిక అన్నారు. గురువారం ఏలూరు కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో కుష్టు వ్యాధిపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో కుష్టు, హెచ్‌ఐవీ, బోధ వ్యాధిగ్రస్తుల కోసం స్వయం సంరక్షణ శిబిరాలు నిర్వహించి మందులు, సలహాలు, సూచనలు అందిస్తున్నామన్నారు. సంస్థ ప్రాజెక్ట్ అసోసియేట్ అబ్దుల్ వహీద్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో 350 మంది కుష్టు వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం, సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వైద్యులు, బాలబాలికల సమక్షంలో సంస్థ 35వ ఆవిర్భావ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వి.శశాంకర్, పీకే కోష్లా తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : వ్యక్తిని కొట్టి గాయపర్చిన నేరంపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కానూరి విజయ్, కానూరి సాయి, కానూరి నాగేంద్ర, తిప్పాని మణిదీప్ గరుడపక్షి నగర్‌లో కలిసి ఉంటున్నారు. మా గురించి అందరికీ చెడుగా చెబుతావా అంటూ వారందరూ ఈనెల 21వ తేదీ రాత్రి తనను కొట్టి గాయపర్చారని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మణిదీప్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కౌలు రైతుల సమస్యలపై బుక్‌లెట్ ఆవిష్కరణ


కౌలు రైతుల సమస్యలపై బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనున్న రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికలలో రాష్ట్రంలో కౌలు రైతులకు సంబంధించిన సమస్యలను చేర్చాలని ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో కౌలురైతుల సమస్యలతో కూడిన 12 పేజీల బుక్‌లెట్‌ను రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి దొంతం కృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడారు. రాష్ట్రంలోసాగు భూమిలో 70 శాతం, సాగుదారుల్లో 80 శాతం వరకూ కౌలు రైతులే పంటలు పండిస్తున్నారన్నారు. కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంట రుణాలు ఇవ్వాలని, ఇటీవల అనావృష్టి, అతివృష్టి వల్ల పంటలు కోల్పోయి నష్టపోయిన కౌలు రైతులకు రూ.2 లక్షల వరకూ ఏ రూపంలో ఉన్న రుణమైనా రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గన్ను వెంకట్రావు, తక్కెళ్లపాటి ప్రసాద్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే, జిల్లా నాయకులు భజంత్రీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతులకు మద్దతుగా వామపక్షాల ధర్నా


స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష పార్టీలు

ఏలూరు (టూటౌన్): కనీస మద్దతు ధర కోసం ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతులపై బీజేపీ, మోడీ ప్రభుత్వం పోలీసుకాల్పులు జరపటాన్ని ఖండిస్తూ ఏలూరులో వామపక్ష పార్టీలు గురువారం ధర్నా నిర్వహించాయి. స్థానిక పాత బస్టాండ్ సెంటర్ వద్ద సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీలు ఆందోళన చేపట్టాయి. ఈ కార్యక్రమానికి సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి యు.హేమశంకర్, సీపీఎం కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న అన్నదాతలపై మోడీ నిరంకుశత్వ ప్రభుత్వం పోలీసులు కాల్పులు జరపడం దారుణమన్నారు. ఈ కాల్పుల్లో శుభ్‌కరణ్‌సింగ్ అనే రైతు మరణించారని, 30 మందికి పైగా రైతులు గాయపడ్డారన్నారు. బీజేపీ ప్రభుత్వం రైతుల ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో రైతులు బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, వివిధ సంఘాల నాయకలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఏలూరు ఎంపీ అభ్యర్థి సునీల్ కుమార్


వికలాంగుడికి వీల్‌చైర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రతి పేదవాడికి మంచి చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని, ఏలూరు నియోజకవర్గంలో పేదలకు అండగా నిలుస్తామని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. స్థానిక శ్రీరాంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో గురువారం పేదలకు చీరలు, వికలాంగులకు వీల్‌చైర్లు ఎమ్మెల్యే ఆళ్ల నాని, మేయర్ షేక్ నూర్జహాన్, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, కోఆప్షన్ సభ్యులు నీతా జైన్, పార్టీ నాయకులు విజయ్‌కుమార్ జైన్, కార్పొరేటర్లు, పార్టీ నాయకులున్నారు.

వైభవంగా రామకోటి మహోత్సవాలు ప్రారంభం


విశేష అలంకరణలో పూజలందుకుంటున్న శ్రీ సీతా, లక్ష్మణ సమేత శ్రీరాముడు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక పేరయ్య కోనేరులో నగరానికి చెందిన శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో 92వ శ్రీ రామకోటి మహోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఉత్సవాల ప్రారంభం సందర్భంగా వివిధ ధ్వజాలను నగరానికి చెందిన అనేక మంది ప్రముఖులు ప్రత్యేక పూజా కార్యక్రాల మధ్య ఆరోహణలు చేశారు. ఉదయం 7 గంటల నుంచి విశ్వశాంతి సమాజం సభ్యులు మౌన ధ్యానం, భక్తి గీతాలాపన, హరేరామ సంకీర్తనలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి సహస్రనామ పూజలు చేసి నిత్య హోమం, నిత్య కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 9.45 గంటలకు విఘ్నేశ్వర పూజ, అనంతరం కలశస్థాపన, అఖండ దీపారాధన జరిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం నగరానికి చెందిన పద్మావతి భజన మండలి ఆధ్వర్యంలో కోలాటం, అనంతరం సంస్కృత పండితుడు మైలవరపు లక్ష్మీనరసింహం 'రామాయణం'పై ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. దివాకరుని శ్రీ వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వరశర్మ విశేష పూజలు నిర్వహించగా శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఈ-చలానాలను రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): ఆటో, క్యాబ్ వాహనాలపై విధించిన ఈ-చలానాలను రద్దు చేయాలని, స్టాప్ లైన్ సీసీ కెమెరాలను క్రమబద్ధీకరించాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.శివాజీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.పోలినాయుడు కోరారు. ఏలూరు పాత బస్టాండ్ సెంటర్లో అసంబద్ధంగా ఏర్పాటు చేసిన సిగ్నల్స్, స్టాప్ లైన్ క్రమబద్ధీకరించాలని, సీసీ కెమెరాల నుంచి విధించే చలానాలను రద్దుచేయాలని కోరారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అధికారులు చేసిన లోపభూయిష్టమైన సిగ్నల్స్, సీసీ కెమెరాలకు ఏలూరు నగరంలో ఆటోలు, క్యాబ్, ట్రక్ డ్రైవర్లు బలైపోతున్నారన్నారు. తక్షణమే అధికారులు ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. రవాణా రంగ కార్మికులందరికీ సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని, కేరళ, తమిళనాడు తరహాలో వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, నాయకులు బి.సోమయ్య, బి.జగన్నాథం, వి.సాయిబాబు తదితరులు మాట్లాడారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మండలంలోని డీ4 సెక్షన్ పరిధిలో చాటపర్రు 33/11 కేవీ సబ్‌స్టేషన్, గుడివాకలంక 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం మండలంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మండలంలోని చాటపర్రు, గుడివాకలంక, తిమ్మారావుగూడెం, కేడీపురం, మొండికోడు, ప్రత్తికోళ్ళలంక, పైడిచింతపాడు, కొక్కిరాయిలంక, కోమటిలంక, పెద్దయాగిరిమిల్లి, చిన్నయాగిరిమిల్లి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

సమస్యాత్మక గ్రామాలు, వ్యక్తులపై ప్రత్యేక దృష్టి

దెందులూరు : పెదవేగి పోలీస్ సర్కిల్ పరిధిలో సమస్యాత్మక గ్రామాలు, వ్యక్తులపై పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక దృష్టి సారించామని సీఐ కొండవీటి శ్రీనివాస్ అన్నారు. గురువారం దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి క్రమశిక్షణ, ప్రభుత్వ నిబంధనలు అనుసరించాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు, ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఇప్పటివరకు నేరచరిత్ర ఉన్న వ్యక్తులు, రౌడీషీటర్లు, కోర్టుల్లో బైండోవరైన వ్యక్తుల ప్రవర్తన, కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కల్పించినా సహించేది లేదని హెచ్చరించారు.

నేటినుంచి వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవాలు

కామవరపుకోట : ఈనెల 23వ తేదీ నుంచి మార్చి 2వ తేదీ వరకు శ్రీ భద్రకాళి సహిత వీరభద్ర స్వామి కల్యాణ మహోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 23 తేదీ ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకము, కుంకుమ పూజలు, సాయంత్రం గండ దీపం వెలిగించుట, 24వ తేదీ తెల్లవారుజామున 3 గంటల నుంచి స్వామివారి కల్యాణం, మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన, రాత్రి జానపద నాట్యం ప్రదర్శన, 25వ తేదీన స్వామివారి రథోత్సవం, ఆ రోజు రాత్రి నుంచి మార్చి 2వ తేదీ వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందని, భక్తులు పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమడోలు: అనారోగ్యం, ఆర్థిక సమస్యలు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. భీమడోలుకు చెందిన లారీ డ్రైవర్, వృద్ధుడు కోపల్లి కేహెచ్ వెంకటరాజు (63) అనారోగ్యం కారణంగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. దీంతో పాటు ఆర్థిక సమస్యలు తలెత్తడంతో మనస్తాపం చెంది ఈ నెల 17న తన ఇంటిలో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఏలూరులోని ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. వైద్యం పొందుతూ వెంకటరాజు మృతి చెందాడని, మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

గణపవరం(ఉంగుటూరు) : ఉంగుటూరు నియోజకవర్గంలో మంజూరైన ప్రభుత్వ గృహాల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని, దీనికోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా హౌసింగ్ అధికారి కేవీఎస్ రవికుమార్ అన్నారు. గురువారం ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయంలో నిడమర్రు, ఉంగుటూరు మండలాలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణంపై డీఆర్‌డీఏ, డ్వామా, ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష జరిపారు. ఆయా మండలాల్లో పూర్తయిన, ప్రగతిలోఉన్న ఇళ్ల వివరాలను సిబ్బంది వివరించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, వసతుల కల్పనపై ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణాలన్నీ త్వరగా పూర్తి చేయడానికి సంబంధిత సిబ్బంది స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు.

చెరకు పంటకు టన్నుకు రూ.5 వేలు మద్దతు ధర ఇవ్వాలి

ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్



ఏలూరు (టూటౌన్): చెరకు పంటకు మద్దతు ధర టన్నుకు రూ.5 వేలు ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. కేంద్ర ప్రభుత్వం 2024–25 చెరకు క్రషింగ్ సీజన్‌కు టన్నుకు రూ.3,400 ఎఫ్ఆర్‌పీ ధర ప్రకటించిందని ఈ ధర చెరకు రైతులకు ఏ మాత్రం సరిపోదన్నారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌నందు గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చెరకు క్వింటాల్‌కు రూ.25 నామమాత్రపు ధర పెంచుతూ ప్రకటించారే తప్ప పెరుగుతున్న ఉత్పత్తి ఖర్చులను వాస్తవికంగా లెక్కగట్టి వాటి ఆధారంగా మద్దతు ధర నిర్ణయించలేదని విమర్శించారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సి2+50 శాతం ఫార్ములా ప్రకారం మద్దతు ధరలు ఇస్తామని చెప్పిన వాగ్దానం అమలు కాలేదన్నారు. మద్దతు ధర నిర్ణయించడానికి ప్రాతిపదికగా ఉన్న రికవరీ శాతం 9.5 శాతం నుంచి 10.5 శాతంకు పెంచి రైతులకు నష్టం చేశారన్నారు. చెరకు మద్దతు ధరపై కేంద్రం పునరాలోచన చేసి టన్ను చెరకుకు మద్దతు ధర రూ.5 వేలు ప్రకటించాలని, మూతబడిన చెరకు ఫ్యాక్టరీలను తెరిపించాలని శ్రీనివాస్ కోరారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

చింతలపూడి: జాతీయ లోక్‌అదాలత్‌ను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌లను వినియోగించుకోవాలని సూచించారు. మార్చి 9న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్ రికవరీ కేసులు, చెక్ బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదా, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులు, మున్సిపాలిటీ పన్ను బకాయి కేసులు పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. సమాచారం కోసం దగ్గరలోఉన్న పోలీస్ స్టేషన్‌లను, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

- జంగారెడ్డిగూడెం: మార్చి 9న జంగారెడ్డిగూడెం కోర్టు నందు నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జంగారెడ్డిగూడెం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్ కుమార్ కోరారు. ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయాన్ని, డబ్బుని ఆదా చేసుకోవచ్చునని అన్నారు. శాశ్వత లోక్‌అదాలత్‌లో మధ్యవర్తిత్వం, ఫ్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ కోసం 08812 224555 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

లింగపాలెం: ములగలంపాడు గ్రామానికి చెందిన చింతలపూడి రంగ అనే మహిళ కేన్సర్ వ్యాధితో మృతి చెందెంది. ఈమేరకు గురువారం ఆమె భర్త నాగరాజుకు సీఎంఆర్ఎఫ్ చెక్కు రూ.1.20 లక్షల చెక్కును ఎంపీ కోటగిరి శ్రీధర్ చేతుల మీదగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, చింతలపూడి అసెంబ్లీ అభ్యర్థి కంభం విజయరాజు, సర్పంచ్ ఇనుగంటి రాజేష్ బాబు, మండల పార్టీ అధ్యక్షులు కొఠారి మోహన్, రంగాపురం సొసైటీ చైర్మన్ రెడ్డిన శ్రీను పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	64	చామదుంపలు	64
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05, 07, 10
బెండకాయలు	44	కంద	64
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	42
కాకర కాయలు	56	కీరా దోస	34
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	74
కాలీఫ్లవర్	--	అల్లం	120
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	18
క్యారెట్	30-40	పాలకూర	10
దొండకాయలు	38	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	24-28	గోంగూర	08
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	30-38	బఠాణి	--
అనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	42
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	29

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	16
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	36
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34